# మాకున్నాయి ఉగాదులు - మాకున్నాయి ఉషస్సులు

'**శి**శిరంలో వసంతం' వసంత వాటిక వారి, చిత్ర కళా ప్రదర్శన అన్న ప్రకటనని పేపర్లో వారం రోజులుగా చూస్తున్నాను. అయినా దాని గురించి పట్టించుకోలేదు. సాహితీ సభలు, సంగీత విభావరు లంత యిష్టంగా చిత్రకళా ప్రదర్శనలని చూడను.

అయితే 'శిశిరంలో వసంతం' లోని అర్థం గ్రహించాకా వెళ్ళాలని నిశ్చయించుకున్నాను.

అడ్రసు చూసాను. పర్వాలేదు ఒక్కదాన్ని వెళ్ళగలను. పెద్ద దూరం కాదు.

రిటైరయ్యి నాలుగు నెలలు కూడా కాలేదు. అప్పుడే నాలో నిరాసక్తత, నిర్లిప్తత చోటు చేసుకున్నాయి. టైము ఎలా గడపాలో తెలీక, నాలుగు రోడ్ల కూడలిలో నుంచున్నట్లుగా, అయోమయంగా అయిపోయింది జీవితం..... ఏం చేయ్యాలి. అన్న ఆలోచనకి ఈ ప్రకటన ఉత్సాహాన్ని కలిగించింది. తయారయ్యి ముందుగదిలోకి వచ్చాను. సోఫా కింద ఉన్న చెప్పుల్ని కాలితో లాగి వేసుకున్నాను.

అక్కడే కూచుని టీవి చూస్తున్న కోడలి నిర్లక్ష్యం చూసి, నేను ఎక్కడి కెళ్తున్నానో చెప్పాలనిపించలేదు.

టీవి మీద నుంచి తల తిప్పకుండానే "తొందరగా వచ్చేయండి" అంది.

నేను ఆగాను. ఆమె యింకా ఏదైనా చెప్తుందేమో నని.

"మీరెక్కడి కెళ్తున్నారో నాకర్కర్లేదు. నేను అడగను. కానీ, ఆరు

గంటలకల్లా వచ్చేయండి. ఆరుగంటలకి మూర్తి ఇంట్లో పార్టీ ఉంది. మేం దాని కెళ్ళాలి. పిల్లలు ఏడుగంటలకి ట్యూషన్ నుంచి వస్తారు. పాలవాడు వస్తాడు. ఓ అరలీటర్ ఎక్కువ పోయించుకోండి. ఉన్న అన్నం అందరికీ సరిపోదు. ఓ గొట్టం వండుకోండి. ఆ రెండో తాళం చెవి ఉంచుకోండి." 'జీవితం అంటే వండుకోవడం తిండం, ఇంతెనా! యింకేం లేదా!' అనుకుంటూ బయటికొచ్చాను. మరో అరగంట కల్లా రవివర్మ ఆర్ట్‌గాలరీలో ఉన్నాను.

లోపల అంత నిశ్శబ్దం. మనుషులున్నా మాట్లాడుతున్నా కూడా ఏదో ప్రశాంతత.

గోడల మీద, ఎక్కువగా ప్రకృతి దృశ్యాలు. కొన్ని చైనీస్ పువ్వులున్న పెయింటింగ్‌లు కూడా ఉన్నాయి.

వర్షంలో తడుస్తున్న పట్టణ దృశ్యాలు, వసంతంలో పులకించి పోతున్న ప్రకృతి, తుఫాను తకిడికి తట్టుకోలేక, ఊగిపోతూ, ఓ వైపు ఒరిగిపోయిన చెట్లు, ఉచ్చుల్లాంటి త్రికోణాల్లో యిరుక్కుపోయిన ఆడవాళ్ళు.

ఏదో ఉత్సాహం. ఆనందం రెండు పొంగాయి. అవి అన్నీ చూసాక.

కారణం, వేసినావిడ, ఆ చిత్రకారిణి ఓ ఎనభయి ఏళ్ళ మనిషి అని తెలిసాకా, ఆవిడ పేరు రాజ్యలక్ష్మి. జీవితం అంటే పెయింటింగ్స్ వేయడం కూడా అన్న స్ఫూర్తి లోపల్నించి వచ్చింది.

ఆవిడని కలుసుకోవాలని అనుక్కుంటూ వాచి చూసాను. టైము ఆరవుతోంది. పర్వాలేదు. ఆవిడని కలుసుకుని, పలకరించి మాట్లాడినా, ఏడు గంటలలోపే యింటికి చేరచ్చు అని అనిపించింది.

ఓ స్థంభం దగ్గర ఖద్దరు చీర కట్టుకున్న ఓ స్త్రీతో ఎవరో మాట్లాడుతూంటే, ఆవిడే రాజ్యలక్ష్మిగారు కావచ్చు అని అనిపించింది.

అటువైపు వెళ్ళి ఆగాను.

"రాజ్యలక్ష్మిగారు... మీరేనా...." సందేహంగా అడిగాను. చిరునవ్వుతో చూసింది.

"సారీ.... నేను కాదండి, ఆవిడ వెళ్ళిపోయారు."

"అయ్యో! నేనావిడతో మాట్లాడుదామనుకున్నాను. ఇంక రారా ఆవిడ!" అంటూ బాధపడ్డాను.

"ఆవిడ, యింక రారు. మీరు అంతగా ఆవిడని కలవాలనుకుంటే, ఆమె అడ్రస్ యిస్తాను. ఆవిడ చాలా సంతోషిస్తారు." అంటూ ఓ చిన్న కార్డుని నా చేతికిచ్చింది.

అడ్రస్ చూసాను. పెద్ద దూరం కాదు. అని అనుకుంటూ ఆ కార్డుని పర్సులో పెట్టుకున్నాను. టైము సరిగ్గా ఆరు. ఓ అరగంటలో యిల్లు చేరచ్చు అని అనుకుంటూ బయటికొచ్చాను.

మర్నాడు పన్నెండు గంటలకి తయారయ్యాను రాజ్యలక్ష్మి గారి దగ్గరికి వెళ్ళడానికి.

కోడలు ఎప్పటిలాగా టీవి ముందు కూచుని ఉంది. సోఫా కింద ఉన్న చెప్పుల్ని కాళ్ళతోనే లాగాను.

"మీరు ఎక్కడి కెళ్తున్నారో నాకక్కర్లేదు. కానీ, రెండు గంటలకల్లా వచ్చేయండి. నేను మా అమ్మావాళ్ళింటి కెళ్ళాలి. ఇద్దరం లేకపోతే యిల్లుకి తాళం పెట్టాలి. పట్టపగలే దొంగతనాలు అవీ ఎక్కువయి పోయాయి. ఆ తర్వాత ఏమీ అనుక్కుని లాభం లేదు. ఏం, వచ్చేస్తారా" అంటూ నావైపు చూసింది.

"తెలీదు చెప్పలేను." ముక్తసరిగా అన్నాను.

"అదేంటీ, అంత పెడసరంగా సమాధానం యిస్తున్నారు."

తెల్లబోయాను, ఆమె మాటలకి.

"యిందులో పెడసరం ఏంవుందమ్మా! ఎన్ని గంటలకి యింటికి రాగలనో నాకే తెలీదు. కనీసం ఐడియా కూడా లేదు. అలాంటిది నీకెలా చెప్పగలను?"

"సరే లెండి, మీరేం చెప్పక్కర్లేదు. నేను మిమ్మల్ని ఏం అనలేదు. మీ

పని మీరు చేసుకోండి. మీరెళ్ళండి. సాయంత్రం పిల్లల్ని తీసుకుని నేను వెళ్తాను. మీ అబ్బాయికి ఫోన్ చేస్తాను. అక్కడికే వచ్చేయమని ఇంక మీ యిష్టారాజ్యం, భరతుడి పట్టం ఎక్కడికైనా వెళ్ళండి, ఎప్పుడైనా రండి, నాకు అనవసరం.....” యింకా ఏదో అంటున్నా వినిపించుకోకుండా బయటికొచ్చాను.

ఎనభయ్యేళ్ళ ఆవిడ అంటె ఏ మంచం మీద కూచునో, ఏ వీల్ చెయిర్ లోనో కూచుని ఉంటారు. అనుకున్న నా అభిప్రాయం తప్పు అయింది.

ముప్పయి నాలుగు డిగ్రీల ఎండలో, నెత్తి మీద ఓ తెల్లని నాప్‌కిన్ వేసుకుని, ఈజిల్ మీద కుంచెని కదిలిస్తూ ఆవిడ కనిపించారు.

నెమ్మదిగా వెనక నుంచుని, చిత్రం వైపు చూసాను. ఎండలో ఎండిపోయిన ప్రకృతి. ఎండిపోయిన కొమ్మల కింద నుంచి నెత్తిన బిందెలతో నడుస్తున్న పల్లె పడుచులు జీవం పోసుకుంటున్నారు. చకచకా కదులుతున్నాయి వేళ్ళు.

ఆ వేళ్ళల్లో ఎంతటి చైతన్యం ఉందో, ఆ చేతి మడతల్లో అంతటి అనుభవాల లోతులు కూడా ఉన్నాయి.

మా చెప్పుల అలికిడి విని మా వైపుకి తిరిగారు. పళ్ళు కనపడకుండా చిరునవ్వుతో చూసి తల నిలువుగా చిన్నగా ఊపారు.

ఏదో దైవత్వం, ఏదో తేజస్సు. ఆ గోధుమ రంగు ఒంటి ఛాయ నుంచి, ఆ చుట్టూరా వ్యాపిస్తోంది.

“కూచోండి, వస్తాను.” అన్నట్టుగా చేయితో సంజ్ఞలు చేసి చెప్పారు ఆవిడ.

“రండి.....” అంటూ ఓ స్త్రీ ఓ గదిలోకి తీసుకెళ్ళి కూచో పెట్టింది నన్ను. చుట్టూరా బీరువాలు అందులో మహానుభావుల ఆలోచనలు, ఆవేశాలు ఊహలు, వ్యూహాలు అక్షర రూపేణా ఉన్న పుస్తకాలు పేరేడ్ చేస్తున్నాయి. అంతా నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలో ఏదో పవిత్రత, ప్రశాంతత.

మనషులు అటూ ఇటూ నడుస్తున్నా కూడా ప్రశాంతతకి ఏ మాత్రం

భంగం కలగలేదు. ఏదో పుస్తకం చూస్తూ కూచున్నాను.

ఓ పావుగంట గడిచాకా, ఓ మనిషి, చేతి కర్ర సాయంతో రాజ్యలక్ష్మిగారు వచ్చారు.

ఓ నడివయసు స్త్రీ టీ తీసుకొచ్చింది. గ్లాసుల్లో మంచినీళ్ళు పోసి మా ముందుంచింది. మంచి నీళ్ళు తాగాము. టీ తీసుకున్నాము.

"మీ కళాఖండాలు చూసాకా ఎంతో ప్రభావితం అయ్యాను. నాక్కూడ ఏదో చేసేయ్యాలన్న తపన, కోరిక – మిమ్మల్ని చూడాలన్న కోరిక కలిగింది. అందుకే....."

నవ్వారు "అదొక్కటీ ఉంటే చాలదు. ఆత్మవిశ్వాసం, ధైర్యం, అంకిత భావం ఉంటే ఏ వయసులోనైనా, ఏదైనా, ఏ పనయినా చేయచ్చు. అది ఉండాలి. జీల్ ఉండాలి.

నెత్తిన గడ్డిమోపుతో, సన్నటి దారిలో నడిచే స్త్రీకి తెలుసు ఆత్మవిశ్వాసం, వంగి, కొడవలితో గడ్డికోసే స్త్రీకి తెలుసు ఏకగ్రత ఏంవిటో... అది ఉండాలమ్మా!

జీవిత చరిత్రలూ ఎప్పుడు చదివే వారికి పాఠాలు. అంటే ఒకరి అనుభవాలు మరొకరికి పాఠాలు. నా దగ్గరికొచ్చిన వాళ్ళకి నా కథ చెప్తుంటాను. ఎందుకంటే పాజిటివ్‌గా వెళ్తూంటే, జీవితాన్ని మనకి నచ్చినట్లుగా చేసుకోవచ్చు అన్న నీతిని, సాటి స్త్రీకి చెప్పాలన్న ఉద్దేశంతోనే. బూడిద కుప్పలాగా అయిపోతున్న నా జీవితాన్ని కాపాడుకున్నాను. ఎటువంటి జీవితం అనుభవించానో నీకు చెప్తాను.

నా భర్త సకల గుణాభిరాముడు. ఉత్త తాగుబోతు. జూదరి, వ్యక్తికి స్వేచ్ఛ ముఖ్యం. అభిప్రాయ స్వేచ్ఛ ముఖ్యం ఒకటేసారి జీవిస్తాం. ఒకటే సారి మరణిస్తాం. ఆ ఒకటే సారి జీవించడానికి ఇలాంటి జీవితం ఎందుకు? జీవితం జీవించే విధంలా ఉండాలి. నా అభిమానం కాపాడుకోవాలి. నావ్యక్తిత్వం కాపాడుకోవాలి.

నా భవిష్యత్తు నేను నిర్ణయించుకోవాలి. అభిమానం పోయాకా జీవితం

గడ్డిపోచకన్నా తేలికయిపోతుంది.

అగ్గిపుల్లని చూస్తే జ్ఞానోదయం అవుతుంది. దానికి తల ఉంది. అందులో ఆలోచించే బుర్ర లేదు. అందుకే అతి చిన్న రాపిడికే మండి పోతుంది.

నాకు తల ఉంది. అందులో ఆలోచించే బుర్ర ఉంది. అలాంటప్పుడు సమస్యల రాపిడిలోంచి జ్వాలలు వస్తూంటే ఎందుకు మండి పోతున్నాను!

నా వయసు యాభైరెండు ఇదో వయసా! కొలంబస్. యాభయ్యారేళ్ళకి, తెలియని దారుల్లో, సముద్రం మీద ప్రపంచం చుట్టడానికి వెళ్ళలేదా! లియోనార్డో తన బెస్ట్ చిత్రాలని డెబ్భై దాటాకా వేసాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ వయసు మళ్ళాకనే కొన్ని వేల చిత్రాలు గీసాడు. లిస్ట్ తీయడం మొదలు పెడ్తే లెక్క లేనంత మంది వస్తారు.

ఆత్మ విశ్వాసం, చెయ్యగలను అన్న ధీమా ఉన్న వాళ్ళెవరినీ ఎవరూ ఏమీ చేయలేరు. వాళ్ళకి అంగవైకల్యం, అనారోగ్యం వయసు ఓ పెద్ద కారణం కాదు" ఆగారు.

మంచి నీళ్ళ గ్లాసు మీద ఉన్న మూత తీసి, మంచి నీళ్ళు తాగి, నా వైపు చూసారు.

"బోర్‌గా ఉందా!" అటూ గ్లాసు టేబుల్ మీద పెట్టారు. ఊపాను. తల అడ్డంగా ఊపాను.

"జరిగి పోయిన దానికి బాధ విచారం లేదు. ఏది జరిగినా అన్ని మంచికే. ఈ రోజున జీవితం యిలా ఉండడానికి కారణం, ఆ రోజున నా నిర్ణయాలే. రాళ్ళే లేకపోతే ఏటికి గలగలలు పాటలూ ఉండేనా! పరాయి స్త్రీల పొందుకోసం పాకులాడే మనిషి మూలంగా నా జీవితం దెబ్బలాటలకి తన్నులకి, ఏడుపుకి అంకితం అయిపోయినట్లుగా అనిపించేది.

ఆలోచనలతో పరధ్యానంగా గడిపిన పగళ్ళున్నాయి. కన్నీళ్ళు నిండిన కళ్ళతో సూర్యోదయం చూడ్డానికి భయపడిన రాత్రిళ్ళు ఉన్నాయి.

ఆర్థిక స్వాతంత్ర్యం బలహీనతల్ని ఓ పక్కకి తోసేస్తుంది. అందుకని ఓ

చిన్న స్కూల్లో తెలుగు నేర్పించడం, స్కూలు అయిపోయాక పిల్లలకి ట్యూషన్ చెప్పడం నాకు కొండంత ధైర్యం చేకూర్చాయి.

పైకి జరిగేది ఒక్కటే జీవితం కాదు. లోపల కనపడని జీవితం కూడా ఉంది. అందుకే మెటీరియల్ జీవితానికి, మానసిక జీవితానికి పూడ్చలేని ఆగాధం ఏర్పడింది - ఘర్షణ..... ఘర్షణ..... అందులోంచి కర్తవ్యం కనిపిస్తోంది.

కన్నీళ్ళు కారిస్తే సుఖం రాదు. రాజీపడ్తే సుఖం రాదు. ఎందుకంటే నా మంచి తనానికి ఫలితం నా భర్తకి లాభం అయింది. తల కాయతో ఆలోచించడం మొదలెట్టాను. వ్యక్తి స్వేచ్ఛ ముఖ్యం.

అందుకే పిల్లల్ని తీసుకుని వచ్చేసాను. దేవుని దయవల్ల పిల్లలు బాగా చదువుకున్నారు. సులభంగా ఉద్యోగాలు వచ్చాయి. యింకా సులభంగా వాళ్ళ పెళ్ళిళ్ళు వాళ్ళు చేసుకున్నారు.

ఈసారి జీవితాన్ని మరో కోణంలోంచి చూడాల్సి వచ్చింది. అందులో కొడుకులు, కోడళ్ళు యిమిడి పోయారు. నేను యిమిడి లేకపోయాను. జీవితం మీద కొత్త ప్రశ్నలు, జవాబులు వెంటనే దొరకని ప్రశ్నలు నన్ను నిలదీయడం మొదలైంది.

మంచి రోజులొస్తాయన్న ఆశతో భవిష్యత్తుని చూసిన నేను జీవితం ఊహించని విధంగా అయ్యేటప్పటికి, నా మీద నాకే జాలి. నా వాతావరణం, కోడళ్ళు పుట్టి పెరిగిన వాతావరణం మధ్య దూరం ఎన్ని వంతెనలు కట్టినా కలవలేదు.

ప్రతీ నిమిషం అలజడి, భర్తకి, కొడుకులకి పెద్ద తేడా కనపడలేదు. చిన్న చిన్న మార్పులతో అదే జీవితం. భర్తకి చేసిన బానిసగిరి కొడుకులకి... ప్రతి నిమిషం రాయని కథలు.

నల్ల మబ్బు ల్లేకపోతే వెండి అంచు సందేశం మనకి తెలిసేదా! బలహీనతలకి పిరికితనం తోడు కాకూడదు. అని తెలుసుకున్నాను.

ఓసారి పడిపోతే జీవితం పడిపోయినట్లేనా! కాదు. ఈసారి నిటారుగా

నుంచోడానికి అవకాశం ఉంది. అన్నం పారం నేర్చుకున్నాను."

నా మొహంలోకి చూసారు"అర్థం అవుతోందా! ఇంట్రో వెర్ట్‌గా ఉంటే ముసలి తనం రెట్టింపు అవుతుంది. ఒంటరి తనం డిప్రెషన్‌కి దారి తీస్తుంది. ఏదో ఒక హాబీ ఉండాలి. విజ్ఞానం సంపాదించుకున్న మనిషి, జ్ఞానం సంపాదించుకోవడం లేదు అదే ట్రాజెడి.

నిన్న ఉన్నట్లు ఇవాళ లేకపోతే మనిషి ఎదుగుతున్నాడని అర్థం. కోపం, కక్షలు, పంతాలు, పట్టింపులు, డబ్బు మదం, అహంకారం జీవితాన్ని ఏలుతున్నారుంటే, అది కదలిక లేని మురికి గుంట లాంటి జీవితం అయిపోతుందన్నమాట. ఊపిరి పీల్చడం జీవితం అని అనుకుంటే చెట్లు, చేమలు, యింకా ఎన్నో ఈ సృష్టిలో ఆ పని చేస్తున్నాయి. ఆ తేడా చూపించడం మానవత్వం ఉన్నవాళ్ళ లక్షణం. అక్కడే మనిషి! జంతువులకి తేడా......" ఆగారు.

తన చుట్టూ ప్రపంచాన్ని రంగుల్లో నింపినావిడ మాటలు విన్నాకా, నేనేంవిటో, నా పరిస్థితి ఏంవిటో అర్థం అయింది. అయోమయంలో కొట్టుకుపోతున్న నాకు ఓ ఊత, ఓ ఆలంబన నిరాశ, నిస్పృహల్లో ఉన్న నాకు ఓ చిన్న ఆశ్వాసన దొరికినట్లనిపించింది.

ఆవిడ నడిపే పెయింటింగ్ స్కూల్లో చేరడానికి నిశ్చయించుకున్నాను నా నిర్ణయాన్ని యింట్లో చెప్పాను.

కొడుకూ, కోడలు గొడవ పెట్టారు.

"నాకు మీ మీద కోపం లేదు కోపంతో వెళ్ళిపోతున్నానని అనుకోకండి. నాకు జీవితం కావాలి. జీవించడం కావాలి టీవి ముందు, నన్ను, నా మెదడుని అప్పగించే వ్యాపకాలు నాకొద్దు. నా వయసు వాళ్ళు, నా రుచులు, అభిరుచులు కలిసే మనుషులున్న ప్రదేశం కావాలి. ఆలోచనలు, వాటి విధానాలు కలిసేవాళ్ళు కావాలి. ప్రతీక్షణం నన్ను నేను మరిచిపోవాలి. చైతన్యవంతమైన జీవితం కావాలి. ఇవన్ని నాకు ఆ 'వసంత వాటిక'లో కనిపించాయి." అన్నాను శాంతంగా.

మర్నాడు చీకటి ఛాయలు యింకా వీడకుండానే బయటికొచ్చాను.

కొడుకులకి ప్రత్యేకంగా గుర్తు చేయాల్సిన బాధ్యతలు ఏమీ లేవు... ఎందుకంటే వాళ్ళు ఏం చేయాలో గుర్తు చేయడానికి కోడళ్ళున్నారు.

ఓ పది అడుగులు వేసి ఆటో మాట్లాడుకుని, నా సూట్‌కేస్ పెట్టి కూచున్నాను. రెండోసారి యింటిని వదిలేస్తున్నాను. మొదటి సారి భర్త ఇంట్లోంటి.

రంయ్యంటూ ఆటో వెళ్తూంటే చల్లటి గాలి మొహాన్ని తాకుతూంటే మనసంతా ప్రశాంతంగా అయిపోయింది. ఇందాకటి భావాల తాకిడి లేదు. అలజడి లేదు. దిగంతాలలోని ప్రశాంతత.

ఉషోదయంలోని హాయిని, అందాన్ని అనుభవించి ఎన్నియుగాలయిందో! ఏం పోగొట్టుకున్నానో, ఏం మర్చిపోయానో మెల్ల మెల్లగా అర్థం అవుతోంది. ప్రకృతికి దగ్గరగా జీవించడం మర్చిపోయాను.

ఆకాశంలో రంగులు మారుతున్నాయి.

నేను వెళ్ళేసరికి, వసంత వాటిక కోలాహలంగా ఉంది. సెక్రెటరి నన్ను ఆహ్వానించింది.

మామిడి తోరణాలు, బంతిపూల దండలు తయారు చేస్తున్నారు. ఆ హడావుడిని దూరంగా వేప చెట్లకింద కూచుని యిద్దరు చిత్రీకరిస్తున్నారు. కాన్వాస్‌ల మీద.

"రెండు రోజుల్లో ఉగాది ఉంది కదా, ఈ హడావుడి అంతా దానికోసమే... అందుకే ఎవరికి తోచినట్లుగా వాళ్ల చేస్తున్నారు..." అని అన్నారు సెక్రెటరి.

వయసుకి జీవితాన్ని జోడించడం అన్నమాట. కిందటి సారి ఉగాది కన్నా ఈ సారి ఉగాదిలో నూతనత్వం.

కొత్త జీవితం కొత్త సంవత్సరం. ఎవరన్నారు మాకు ఉగాదుల్లేవు మాకు ఉషస్సుల్లేవని! ఏ వయసులోనైనా జీవితం జీవితమే. ఉగాది ఉగాదే.

ఉషస్సులోని ప్రశాంతతని, ఉగాదిలోని నవీనతని పొందడానికి వసంత వాటికలోకి అడుగు పెట్టాను.

(సుజన రంజని 2007, మార్చి)